RNI NO:APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



# గంట గంటకు రిపోర్టు పేరుతో కార్మికులపై వేధింపులు మానుకోవాలి

### క్లరికల్ , ఇతర ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

### సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మంద

కొత్తగూడెం సింగరేణి, జూలై 19 (తెలంగాణ వాణి)



ఇటీవల కాలంలో వర్క్ స్టడీ పేరుతో ఆఫీసులలో పనిచేస్తున్న సిబ్బందిపై సింగరేణి యాజమాన్యం ప్రతి గంటకు మీరు చేసిన పని ఏమిటో రిపోర్టు ఇవ్వాలని వేధింపులకు గురి చేయటం తగదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్( సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు తీవ్రంగా ఖండించారు. ప్రతి సెక్షన్ కు ఒక ఆఫీసర్ ఉంటాడని రోజువారి పనిని అతను ఆ సెక్షన్లో పని చేస్తున్న సిబ్బందికి పని పురమాయించడమేమిటని ఆయన ప్రశ్నించారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉంటాడని అలాంటి ఆనవాయితీ ఇప్పటివరకు కొనసాగిందని దానికి విరుద్ధంగా గంటకు చేసిన పని ఏమిటో రిపోర్ట్ ఇవ్వాలని వేధించటానికి ఇలాంటి సర్కులర్ తీసుకొచ్చి పనిచేసే కార్మికులకు తీవ్ర మనోవేదన గురి చేయటం సరైంది కాదని విమర్శించారు. అసలు పని చేసే దానికంటే ఈ రిపోర్ట్ లు ఇవ్వటానికే సమయం వెచ్చించాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే దీనివల్ల కంపెనీకి సమయం వృధా అవుతుంది తప్ప ప్రయోజనం లేదని ఇట్లాంటి విధానాలు కంపెనీ పని పరిస్థితులకు మోటివేషన్ కు ఉపయోగపడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పని సంస్కృతి మెరుగుపడాలంటే సింగరేణి వ్యాపితంగా ఉన్న సెక్రటేరియల్ సిబ్బంది కొరతను తీర్చడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని ఆరోపించారు. గత రెండు సంవత్సరాల క్రితం ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా అంతర్గత పరీక్షలు నిర్వహించి అలాంటి పోస్టులను భర్తీ చేయాల్సిన బాధ్యతను సింగరేణి యాజమాన్యం విఫలమైందని వ్యాఖ్యానించారు. తాత్కాలికంగా బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్లను ఎలాంటి తర్ఫీదు లేకుండా వారితో పని చేయించుకునే స్థితికి దిగజారిన యజమాన్యం చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి వ్యాప్తంగా ప్రతి సెక్షన్లో ప్రతి డిపార్ట్మెంట్లో ప్రతి మైనులో సరైన సిబ్బంది లేక అండర్ గ్రౌండ్ లో పనిచేసే వారు తమకున్న సమస్యలను అడిగితే సరైన సమాధానం దొరకక కార్మికులకు సంబంధించిన సమాచారం ఇవ్వటంలో కానీ వారి సమస్యలు సక్రమంగా చేపట్టడంలో గాని వారి సమస్యలు ఎవరు తీరుస్తారు అని తెలియక సతమతమవుతున్నారని కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం అసలు చేయాల్సిన పనిని వదిలేసి ఇట్లాంటి పనికిమాలిన పనులు చేయటం సరైనది కాదని ఆయన పేర్కొన్నారు. సింగరేణి సంస్థ చేయాల్సిన పనులు ముఖ్యంగా కంపెనీలో అనేకమంది మస్టర్లు పడి పుఖ్యానికి పోతున్న వారిపై దృష్టి పెట్టి వారిని సక్రమంగా పనిలో పెడితే పని సంస్కృతి మెరుగుపడుతుందని వివరించారు. కంపెనీలో పని సంస్కృతి మెరుగుపడాలంటే పై స్థాయిలో సరిచేసి కింది స్థాయికి పని సంస్కృతిని సరి చేయాలి తప్ప, కింది నుంచి పైకి సరి చేయటం కాదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా సంస్థ మనుగడ కోసం చర్యలు చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# లక్ష్మీదేవిపల్లి మండల ఉపసర్పంచుల ఫోరం ఏర్పాటు

### అధ్యక్షుడిగా యాకుబ్ పాషా ఎన్నికరాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చావల పురుషోత్తం బాధ్యతలు



లక్ష్మీదేవిపల్లి జూలై 19 (తెలంగాణ వాణి)



లక్ష్మీదేవిపల్లి మండలంలోని లోతువాగు గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం తెలంగాణ ఉపసర్పంచుల ఫోరం సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ముఖ్య అతిథిగా హాజరై ఉపసర్పంచులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పలు నియామకాలను ప్రకటించారు. లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన చావల పురుషోత్తంను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, లోతువాగు గ్రామ ఉపసర్పంచ్ యాకుబ్ పాషాను లక్ష్మీదేవిపల్లి మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా నియమించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ చేతుల మీదుగా ఇద్దరికీ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు మాట్లాడుతూ, తమపై ఉంచిన నమ్మకానికి రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపసర్పంచుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, సంఘ బలోపేతం కోసం సమిష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రామారావు, రాష్ట్ర కార్యదర్శి కిషోర్ నాయక్, ఉపసర్పంచులు వెంకట నరసయ్య, రాజు, కేశవరావు తదితరులతో పాటు వివిధ మండలాలకు చెందిన ఉపసర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇది ప్రజా పాలన కాదు.. దాడుల పాలన

### ఆదివాసి మహిళా రైతుపై దాడులు చేయడం సరికాదు

### పొజిషన్లో ఉన్న ఆదివాసి గిరిజనులకు వెంటనే పోడు హక్కులు ఇవ్వాలి

### మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సీతాలక్ష్మి

కొత్తగూడెం, జులై 19 (తెలంగాణ వాణి)



అశ్వాపురం మండలం మనుబోతులపాడు ఆదివాసి రైతులపై అటవీ శాఖ అధికారులు చేసిన దాడి దుర్మార్గమని కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన మహిళలపై పురుష అధికారులు చేయి చేసుకోవడం సరైంది కాదని ఆరోపించారు . తిరిగి ఆదివాసి రైతులపైనే కేసులు నమోదు చేయడం వీరి అసమర్ధ పాలనకు నిదర్శనం అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గిరిజనులకు ఇచ్చిన పోడు హక్కుల హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంటలు సాగు చేస్తున్న సమయంలో వాటిని ధ్వంసం చేసి, ఆపై మహిళలని కూడా చూడకుండా కొట్టడం హేయమైన చర్య అని ఆరోపించారు. ఇలాంటి చర్యలను ప్రభుత్వం మానుకోవాలని ఇతవు పలికారు. గిరిజన ప్రాంతమైన భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా భూసర్వే చేసి పొజిషన్లో ఉన్న ఆదివాసీ గిరిజన రైతులకు పోడు పట్టాలు అందించాలని ఆమె ఈ సందర్బంగా డిమాండ్ చేశారు.

# మంత్రి పొంగులేటి పర్యటన సందర్భంగా బైక్ ర్యాలీ



### భారీ ఎత్తున పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ, ఐఎన్టియుసి కొత్తగూడెం ఏరియా నాయకులు కార్యకర్తలు, ప్రజలు

కొత్తగూడెం సింగరేణి జూలై 19 (తెలంగాణ వాణి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి ఓల్డ్ డిపో నుండి పోస్ట్ ఆఫీస్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి స్వాగతం పలికారు కాంగ్రెస్ శ్రేణులు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవి ప్రసన్న ఆళ్ళ మురళి, కంచర్ల చంద్రశేఖర్రావు చీకటి కార్తీక్, ఊకంటి గోపాలరావు, త్రివేది, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు కార్పొరేటర్లు, సర్పంచులు, బిఎల్వోలు బిఎల్ఎ లతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాటు సింగరేణి కొత్త గూడెం ఏరియాకి చెందిన ఐఎన్టియుసి నాయకులు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం విద్యానగర్ లోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కి చెందిన బిఎల్ఏ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఏ ఒక్కరి ఓటు రద్దు కాకుండా చూడాలని, 18 సంవత్సరాలు దాటిన యువతి యువకులు తమ ఓటును నమోదు చేసుకునేలా కాంగ్రెస్ పార్టీకి చెందిన బిఎల్ఎ లు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐఎన్టియుసి నాయకులు బిఎల్ఎ లకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ ఆధ్వర్యంలో ఐఎన్టియుసి నాయకులు చిలకల రాజయ్య, ఎండి సత్తార్ పాష, ఈ మోహన్ రెడ్డి, పోశం శ్రీనివాస్, సకినాల సమ్మయ్య, భీముడు, గోపు కుమార్ స్వామి, మల్లరపు కొమరయ్య, విప్లవారెడ్డి, జల్లి కిరణ్, స్వామి కొండ, భాను కమల్, శ్రీనివాస్, చందులాల్ కాసర్ల శ్రీనివాస్, వల్లల సాంబమూర్తి, సీతారాం, చిరంజీవి, కొమ్ము సాంబయ్య, జే రవి, ప్రభాకర్, ఖాజా పాషా, కొప్పుల కుమార్, కట్ట నరసింహారావు, టి రమేష్, మంద నరసింహారావు, రమాకాంత్, నామాల శ్రీనివాస్, రామస్వామి, రామ్మోహన్, కృష్ణమూర్తి, లగ్గాల అజయ్, ఎంఏ సవీర్, వినోద్, ఉపేందర్, వీరన్న, వైశంకర్,జాడిప్రసాద్,కనకరాజు,కాంగ్రెస్నాయకులు కార్యకర్తలు, ఐఎన్టీయూసీ నాయకులు,కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఘనంగా హతీరాం బావాజీ జయంతి వేడుకలు



### బంజారాల సంస్కృతిని కాపాడుకోవాలి : మేయర్ గణేష్

### భోగ్‌బండారోలో పాల్గొన్న శ్రేయాస్ మీడియా చైర్మన్ శ్రీనివాసరావు

### ప్రత్యేక పూజలు నిర్వహించిన సాధు సంత్‌లు, గిరిజన పూజారులు

కొత్తగూడెం, జూలై 19 (తెలంగాణ వాణి)



శ్రీ వెంకటేశ్వరస్వామితో పాచికలు ఆడిన అత్యంత ప్రియమైన భక్తుడు హతీరాం బావాజీ 597వ జయంతి వేడుకలను బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ బానోత్ వీరునాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని ప్రకృతి ఆశ్రమంలో నిర్వహించిన వేడుకలకు కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ నాయక్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. గిరిజన పూజారులు, సాధు సంత్‌లు ప్రత్యేక పూజలు, హోమం, భోగ్‌బండారో కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ గణేష్ మాట్లాడుతూ బంజారాల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేటి తరానికి మన పూర్వీకుల విశిష్టతను తెలియజేయాలని కోరారు. బంజారాల్లో ఎంతోమంది దైవాంశసంభూతులు ఉన్నారని, వారిని పూజిస్తూ ఆశీస్సులు పొందాలన్నారు. ఈ భోగ్‌బండారో వేడుకల్లో శ్రేయాస్ మీడియా చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొని పూజా కార్యక్రమాలను ప్రత్యక్షంగా తిలకించారు. బంజారాల సంస్కృతి, సాంప్రదాయాల గురించి సాధు సంత్‌లను గిరిజన పూజారులను అడిగి తెలుసుకున్నారు. జగదంబ సేన వ్యవస్థాపక అధ్యక్షులు తేజావత్ రాములు మహరాజ్ మాట్లాడుతూ హతీరాం బావాజీ శ్రీ వెంకటేశ్వరస్వామి వారితో అత్యంత సన్నిహితంగా ఉంటూ ఆయనతో పాచికలు ఆడినట్లు చరిత్ర చెబుతుందన్నారు. గతంలో తిరుమల దేవస్థానంలో బంజారాలకు ప్రాధాన్యత ఉండేదని గుర్తుచేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వీరూ నాయక్ మాట్లాడుతూ ప్రతీ ఏడాది సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను నిర్వహించిన విధంగానే బంజారాలంతా కలిసికట్టుగా ఉంటూ శ్రీ హతీరాం బావాజీ జయంతి వేడుకలను సైతం నిర్వహించుకునేందుకు బంజారాలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ప్రాంగణంలో శ్రీ హతీరాం బావాజీ మఠాన్ని ఏర్పాటు చేసేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ హతీరాం బావాజీ మఠాన్ని కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడుదామన్నారు. వచ్చే నెలలో జరగనున్న తీజ్ వేడుకలకు జేఏసీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఏసీ గౌరవ అధ్యక్షులు రాములు నాయక్, రమేష్ రాథోడ్, జేఏసీ జిల్లా నాయకులు కేశవ్, భద్రు, హనుమంతు, మంచ్యా నాయక్, శంకర్ నాయక్, సర్పంచ్ లైలా, సాధు సంత్‌లు భద్య, శంకర్, బాలు, రమేష్, గురు, లచ్చు, బాలు, సక్రు, మిట్టు, యువశక్తి చంద్రకళ, శివశక్తి సౌజన్య, టిఎస్‌టిటిఎఫ్ నాయకులు బి.రాములు, బి. రమేష్ రాథోడ్, రత్నాకర్, బి.మోహన్, బాలకృష్ణ, బాబులాల్, రవి, చందర్, వీరన్న, మోహన్, నర్సింహా, పీఆర్‌టీయూ నాయకులు బి.భాస్కర్, టి.మోహన్, యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకులు జె.బి. బాలు, సేవాలాల్ సేన రైతు సంఘం నాయకులు ధరావత్ కృష్ణ, చందర్, వినోద్, రాకేష్, వెంకన్న, ప్రసాద్, హతీరాం, బీజేపీ జిల్లా నాయకులు సీతారామ, పూన్యా నాయక్, రుక్మిణి, గంగ, సుజాత, మేఘన, సాలీ తదితరులు పాల్గొన్నారు.

# అదనపు కట్నం కోసం వేధింపులు.. వివాహిత బలి

### ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన తర్వాత 20 లక్షలు డిమాండ్

### భర్త, ముగ్గురు అక్కలపై కేసు నమోదు

టేకులపల్లి, జూలై 19 (తెలంగాణ వాణి)

అదనపు కట్నం కోసం భర్త, అతని కుటుంబ సభ్యులు చేసిన వేధింపులు ఓ వివాహిత ప్రాణాలను బలితీసుకున్నాయి. ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన తర్వాత మరో రూ.20 లక్షలు తీసుకురావాలంటూ నిరంతరం మానసిక, శారీరక వేధింపులకు గురి చేయడంతో మనస్తాపానికి గురైన యువతి గడ్డి మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడింది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో విషాదాన్ని నింపింది.మండలంలోని శం భునీగూడెం గ్రామానికి చెందిన వజ్జ సుమ (25)కు లక్ష్మీదేవిపల్లి మండలం కొత్త చింతకుంట గ్రామానికి చెందిన వజ్జ వెంకటేశ్వర్లు తో 2023 మే 16న వివాహం జరిగింది. పెళ్లి సమయంలో వధువు కుటుంబం లక్ష రూపాయల కట్నం ఇచ్చింది. అయితే వివాహం జరిగినప్పటి నుంచే వెంకటేశ్వర్లు భార్యను అనుమా నిస్తూ వేధింపులకు గురిచేసేవాడని కుటుంబ సభ్యులు ఆరోపిం చారు.తొమ్మిది నెలల క్రితం వెంకటేశ్వర్లుకు ప్రభుత్వ ఉద్యోగం రావడంతో దంపతులు నాగార్జునసాగర్‌కు వెళ్లి నివాసం ఉంటు న్నారు. ఉద్యోగం వచ్చిన తర్వాత భర్తతో పాటు అతని అక్కలు కాలం విజయ, కోరగట్టు రజిత, చెట్టుపల్లి సుజాతలు కలిసి మరో రూ.20 లక్షలు కట్నంగా తీసుకురావాలని సుమపై ఒత్తిడి తెచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ వేధింపులు భరించలేక సుమ పది రోజుల క్రితం పుట్టింటికి చేరింది.అయినా వేధింపులు ఆగలేదు. ఈ నెల 18న మధ్యాహ్నం భర్త వెంకటేశ్వర్లు తన ముగ్గురు అక్కలతో కలిసి శంభునీగూడెంలోని సుమ పుట్టింటికి వెళ్లాడు. అక్కడ సుమతో వాగ్వాదానికి దిగడంతో పాటు కాలం విజయ ఆమెను దుర్భాషలాడుతూ జుట్టు పట్టి లాగి, కాళ్లతో తన్నినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అందరి ముందు జరిగిన అవమానాన్ని తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైన సుమ అదే రోజు మధ్యాహ్నం ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది.కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కొత్తగూడెంలోని గాయత్రి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందింది.మృతురాలి తండ్రి బట్టు భద్రయ్య ఫిర్యాదు మేరకు భర్త వెంకటేశ్వర్లు, అతని అక్కలు కాలం విజయ, కోరగట్టు రజిత, చెట్టుపల్లి సుజాతలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టేకులపల్లి ఎస్ఐ తిరుపతి తెలిపారు.

# అనారోగ్యంతో ఉన్న బాల్యమిత్రుడికి అండగా ఎస్ఎస్సీ-2000 బ్యాచ్

### రూ.50 వేల ఆర్థిక సాయం



చర్ల, జూలై 19 (తెలంగాణ వాణి):

చర్ల మండలం గొమ్ముగూడెం గ్రామానికి చెందిన చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్ఎస్సీ2000 బ్యాచ్ విద్యార్థి కురిచేటి రాఘ వేంద్రరావు అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న సహచర మిత్రులు ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. చిన్ననాటి స్నేహానికి గుర్తుగా అందరూ స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి ఈ సహాయం చేసినట్లు తెలిపారు. రాఘవేంద్రరావు త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో అండగా నిలిచిన మిత్రులకు రాఘవేంద్రరావు కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బడుగు రాజు, మాణిక్యాలరావు, నవీన్, మీసాల సతీష్, శోభన్‌బాబు, పాపారావు, చింతా సతీష్ తదితర సహచర మిత్రులు పాల్గొన్నారు.

# మేమంటే.. మేమన్నారు.. సాధించిందేమిటి!

### ఏఐటీయూసీ, ఐఎన్టియుసి వైఫల్యాల వల్ల మెడికల్ బోర్డులో కార్మికులకు అన్యాయం

### టీబీజీకేఎస్ రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ

కొత్తగూడెం సింగరేణి, జులై 19 (తెలంగాణ వాణి)



సింగరేణిలో మెడికల్ బోర్డు తిరిగి పెట్టించింది మేమంటే.. మేమే.. అంటూ ప్రగాల్భాలు పలికిన ఏఐటీయూసీ, ఐఎన్టియుసి కార్మిక సంఘాలు చివరికి సాధించింది ఏమిటని టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రెటరీ కాంప్ కృష్ణ వ్యాఖ్యానించారు. ఆదివారం టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మెడికల్ బోర్డు గురించి ఎద్దేవా చేసిన అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, గుర్తింపు కార్మిక సంఘాల నాయకులు సాధిం చిందేమిటో సింగరేణి కార్మిక వర్గానికి చెప్పాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే మూడు బోర్డులు నిర్వహిస్తామని చెప్పి 17 నెలల నుండి ఒక్క బోర్డు నిర్వహించకుండా మొక్కుబడిగా పెట్టించిన మెడికల్ బోర్డులో అన్యాయం చేసి కార్మికులను దుఃఖసాగరంలో నెట్టారని వ్యాఖ్యానించారు.కెసిఆర్ ముఖ్యమంత్రి ఉన్నప్పుడు మెడికల్ బోర్డులో 200, నుండి 250మంది హాజరుకాగా 80 శాతం, 90 శాతం అన్ఫిట్ అయితే ఈ 17 నెలల తర్వాత జరిగినటువంటి మెడికల్ బోర్డులో 20శాతం మాత్రమే అన్ఫిట్ అయ్యారని, దీనికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యంతో పాటు గెలిచిన యూనియన్ సంఘాల వైఫల్యమే అన్నారు. అంతేకాకుండా ఏ మాత్రం కార్మికులకు లాభం చేకూరే విధంగా చేయని యూనియన్స్, సింగరేణికి తాడిచర్ల 2 బ్లాక్ లీజు ఇవ్వడన్ని మా ఘనత అని చెప్పుకుంటూ సింగరేణి సిఎండి కృషి ఏమి లేదన్నట్టు తమకు తామే గొప్పలు చెప్పుకోవడం వింతగా ఉందని వ్యాఖ్యానించారు.2013నుండి ప్రాసెస్ లో ఉంటే తాము ఇచ్చామని చెప్పుకుంటున్న బిజెపి ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంటే నామినేటెడ్ పద్ధతిలో కోయగూడెం ఓసి త్రీ, సత్తుపల్లి ఓసి త్రీ, మణుగూరు డిప్ సైడు బ్లాక్, శ్రావణపల్లి అక్షన్ లో పెట్టుకున్న 17 బ్లాక్ లను సింగరేణి కేటాయించి వాళ్ళ నిజాయితీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. మైనింగ్ స్టాప్ కు టెక్నీషియన్లకు సూటబుల్ జాబ్ ఇప్పిస్తున్నామని గొప్పలు చెప్పుకున్న ఏఐటీయూసీ మరి ఈ బోర్డులో ఫిట్ ఫర్ జనరల్ అసిస్టెంట్ అని ఇచ్చిన వారికి సమాధానం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కూసన వీరభద్రం, కార్పొరేట్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తుమ్మ శ్రీనివాస్, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య, సంయుక్త కార్యదర్శి వశికర్ల కిరణ్, సెంట్రల్ కమిటీ మెంబర్లు కాగితం విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
సోమవారం । 20 । జూలై । 2026

## ప్రజాప్రతినిధుల వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వార్తలు రాయడం జర్నలిజం విలువలకు విరుద్ధం

**- సిపీఐ ప్రజాప్రతినిధులపై తప్పుడు ప్రచారాలను ఖండించిన కంచర్ల జమలయ్య**





**పాల్వంచ, జూలై 19 (తెలంగాణ వాణి):**
ప్రజాప్రతినిధుల వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా ఆధారాలు లేని, ఊహాజనిత కథనాలను ప్రచురించడం జర్నలిజం విలువలకు విరుద్ధమని సిపీఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అన్నారు. ఆదివారం పాల్వంచలోని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపీఐ ప్రజాప్రతినిధులపై బురదజల్లే ఉద్దేశంతో తప్పుడు వార్తలు ప్రచురించడం ఖండనీయమని పేర్కొన్నారు. ఇటువంటి అసత్య ప్రచారాల వెనుక ఎవరి ప్రమేయం ఉందో తేల్చి, అవసరమైతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**మర్యాదపూర్వక భేటీని వక్రీకరించడం సరికాదు : కార్పొరేటర్ పడాల ఆకాంక్ష**

ఈ సందర్భంగా 11వ డివిజన్ కార్పొరేటర్ పడాల ఆకాంక్ష మాట్లాడుతూ, కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లిన సందర్భంగా తమ సామాజిక వర్గానికి చెందిన ఎంపీ ఈటెల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా మాత్రమే కలిశానని స్పష్టం చేశారు.ఆ భేటీకి సంబంధించిన వాట్సాప్ స్టేటస్ ఫోటో ఆధారంగా తాను సిపీఐ నుంచి బీజేపీలో చేరుతున్నట్లు ఒక పత్రిక నిరాధార కథనం ప్రచురించడం బాధాకరమన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని, భవిష్యత్తులో ఇలాంటి కథనాలు పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక పార్టీ ప్రజాప్రతినిధి మరో పార్టీ ప్రజాప్రతినిధిని మర్యాదపూర్వకంగా కలవడం తప్పు కాదని పేర్కొన్నారు. తప్పుడు కథనాన్ని సంబంధిత పత్రిక యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాలిగంటి శ్రీనివాస్, వి. పూర్ణచంద్రరావు, నేరెళ్ల రమేష్, పడాల భవాని తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల సాధనకు కదలాలి

**ఏజెన్సీ చట్టాల పటిష్టంకోసం సమష్టిగా ఉద్యమించాలి**
**అటవీ హక్కులను పరిరక్షణపోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయి**
**అఖిలభారత ఆదివాసి మహాసభ ఇంచార్జి అని రాజా**







**పాల్వంచ, జూలై 19 (తెలంగాణ వాణి)**
గిరిజన హక్కుల సాధనకు, ఏజెన్సీ చట్టాల పరిరక్షణకు గిరిజన లోకం ఐక్యంగా కదలాల్సిన అవసరం ఉందని అఖిలభారత ఆదివాసి మహాసభ ఇంచార్జి అని రాజా పిలుపునిచ్చారు. తెలంగాణ గిరిజన సమాఖ్య (టీజీఎస్) రాష్ట్ర తృతీయ మహాసభల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్, అమరజీవి సోయం రంగులు నగర్, టాను నాయక్ ప్రాంగణంలో ఆదివారం అత్యంత ఉత్సాహంగా రెండో రోజు ప్రతినిధుల సభ జరిగింది. టీజీఎస్ పతాకాన్ని గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు కల్లూరు వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాలకుల ప్రజావ్యతిరేక విధానాల వల్ల గిరిజన ప్రాంతాల్లో హక్కులు కాలరాయబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తరతరాలుగా అడవిని నమ్ముకుని బతుకుతున్న గిరిజన బిడ్డలను భూములకు దూరం చేసే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. పోడు సాగుదారులకు పూర్తి రక్షణ కల్పించే వరకు, గిరిజన సంక్షేమం సిద్ధించే వరకు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.ఐక్య ఉద్యమాలతోనే న్యాయం జరుగుతుంది,అణచివేత వైఖరిని వీడాలని డిమాండ్ చేశారు.భూములపై నిర్బంధాలను అడ్డుకుంటామని, గిరిజన హక్కుల రక్షణకు సిద్ధమవ్వాలని, ప్రజా పక్షాన పోరాటాలు సాగిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుఐక్య ఉద్యమాల తోనే గిరిజన హక్కుల రక్షణ, న్యాయంసాధ్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడుతూ పాలకుల అణచివేత వైఖరిని గిరిజన లోకం ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు. గిరిజన భూములపై ఎలాంటి నిర్బంధాలను పెట్టినా సహించేది లేదని, అడవిపై సర్వహక్కులు గిరిజనుల వేనని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజా పక్షాన ఉంటూ బలమైన ఉద్యమాలను నిర్మించి గిరిజన బిడ్డలకు పూర్తి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.గిరిజన సమాఖ్య బలోపేతం ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని రాష్ట్ర టీజీఎస్ ప్రధాన కార్యదర్శి అంజయ నాయక్ పేర్కొన్నారు. ప్రతినిధుల సభలో ఆయన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కాలంగా గిరిజన హక్కుల కోసం చేసిన ఉద్యమాలను, భవిష్యత్తు కార్యాచరణను నివేదికలో పొందుపరిచామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, విద్యా, వైద్య రంగాల బలో పేతం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రవేశపెట్టిన నివేదికపై ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించి పలు అంశాలపై మహాసభలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పోలవరం పేరుతో ఆదివాసీల జల సమాధి అవుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్ పాషా పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు పేరుతో సుమారు రెండు లక్షల మంది ఆదివాసీలను జల సమాధి చేస్తున్నారని తరతరాలుగా అడవిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న అమాయకులను అభివృద్ధి పేరుతో అడవుల నుండి దూరం చేసి సహజ వనరులను కొల్లగొట్టేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రామ్మూర్తి నాయక్, అంజయ్య నాయక్, సిపిఐ టిజిఎస్ నాయకులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వి పూర్ణచంద్రరావు, అడుసుమిల్లి సాయిబాబా, భూక్య దస్రు, ఉప్పు శెట్టి రాహుల్, భూక్య శ్రీనివాస్, సోందే కుటుంబరావు, వెంకట్ రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టేకులపల్లి మండలానికి విద్యుత్ వెలుగులు

**ముత్యాలంపాడులో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం**





**టేకులపల్లి, జూలై 19 (తెలంగాణ వాణి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు వద్ద నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సబ్‌స్టేషన్‌తో టేకులపల్లి మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సమస్యలు తగ్గి, రైతులు, గృహ వినియోగదారులు, చిన్న పరిశ్రమలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వీరభద్రం, ఎంపీడీఓ శ్రీదేవి,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఖాదర్ బాబు, ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్-ఉమా,స్థానిక సర్పంచ్ బానోత్ పూల్ బంతి ,ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీనాయకులు,కార్యకర్తలు,రైతులు,భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనికార్యక్రమాన్నివిజయవంతం చేశారు.

## చర్ల భూ సమస్యల పరిష్కారానికి విజయ్ నాయుడు చొరవ



**భద్రాచలం, జూలై 19 (తెలంగాణ వాణి):**
చర్ల మండల ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపిన చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ విజయ్ నాయుడు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని రెవెన్యూ పెండింగ్ కేసులు, భూ రికార్డుల సవరణ, పట్టాదార్ పాస్‌బుక్స్, భూ హక్కులు, గిరిజనులు, రైతుల భూములకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను సానుకూలంగా పరిశీలించి అధికారులతో సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మండల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని విజయ్ నాయుడు కోరారు.

# పీహెచ్‌సీ ఏర్పాటు కోరిన సేవాలాల్ సేన నేతల ముందస్తు అరెస్టు



**టేకులపల్లి, జూలై 19 (తెలంగాణ వాణి):**
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క టేకులపల్లి మండల పర్యటన సందర్భంగా బోడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించేందుకు వెళ్తున్న సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్‌తో పాటు పలువురు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడాన్ని ఆ సంఘం తీవ్రంగా ఖండించింది.సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవి రాథోడ్, రాష్ట్ర కార్యదర్శి భూక్యా శ్రీను నాయక్ మాట్లాడుతూ, టేకులపల్లి ఏజెన్సీ ప్రాంతంలోని బోడు, సిద్దారం, బర్లగూడెం, జంగాలపల్లి, ఒడ్డుగూడెం, రాజారాం తండా, లచ్చగూడెం, గంగారం, కొప్పురాయి, రామచంద్రపేట తదితర గ్రామాల ప్రజలు వైద్యం కోసం 40 కిలోమీటర్ల దూరంలోని సులానగర్ పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తోందన్నారు. సరైన వైద్య సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.
ప్రజల సమస్యను ప్రభు త్వ దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుతంగా వినతిపత్రం అం దించాలనుకున్న నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామిక చర్య అని విమర్శించారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయడంతో పాటు బోడు గ్రా మంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ముందస్తు అరెస్టైన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, జిల్లా కార్యదర్శి బాదావత్ సురేష్ నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి జర్పుల లాలు నాయక్, నరేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థలో బీఎల్‌ఓల పాత్ర కీలకం

**ఎస్ఐఆర్ సర్వేలో 100 శాతం పూర్తి చేసిన బీఎల్ఓకు సన్మానం**



**మధిర, జూలై 19 (తెలంగాణ వాణి):**
ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ సర్వేను మధిర మండలం జాలిముడి గ్రామంలో 100 శాతం పూర్తి చేసిన బీఎల్ఓ జిల్లెల్ల వెంకమ్మను గ్రామ సర్పంచ్ శీలం కోటేశ్వరికృష్ణారెడ్డి దంపతులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో బీఎల్‌ఓల పాత్ర కీలకమని, ప్రభుత్వ లక్ష్యాల సాధనలో వారి నిబద్ధత అభినందనీయమని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆగస్టు 23న తీజ్ పండుగ నిర్వహించాలని నిర్ణయం





**టేకులపల్లి, జూలై 19 (తెలంగాణ వాణి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని జై సేవాలాల్‌జై జగదంబ దేవి ఆలయ ప్రాంగణంలో ఆదివారం తండాల నాయకులు, కార్బరీలు, ప్రజాప్రతినిధులు, మేధావుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడిగా ఆగస్టు 23, 2026న తీజ్ పండుగను అన్ని తండాల్లో ఒకేరోజు నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు 14న ఘవ్ గాలేరు, ఆగస్టు 15న తీజ్ బోయెరో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బంజారా మహిళల భక్తి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన తీజ్ పండుగను ఐక్యంగా నిర్వహించి, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుడి ధర్మకర్త భూక్య గన్నా నాయక్, మంతు సేవాలాల్ మహారాజ్,భూక్యా దళ్ సింగ్ నాయక్, బానోత్ మోతిలాల్ నాయక్, మాను నాయక్, బోడ మంచా నాయక్, భూక్య కిషోర్ సింగ్ నాయక్, బోడ పుణ్య-గంగా నాయక్, భూక్య లాలు నాయక్, మూడ్ హుస్సేన్ నాయక్, హలవత్ స్వామి నాయక్, బొడా మోతిలాల్ నాయక్, మూడు బిచ్చు నాయక్, మూడ్ రమేష్, హమాలీ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## కామేపల్లిలో అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం భట్టి శ్రీకారం



**కామేపల్లి, జూలై 19 (తెలంగాణ వాణి):**
ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అడవి మద్దులపల్లిలో రూ.2.85 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే రూ.3.95 కోట్లతో తాళ్లగూడెంనర్సయ్యకుంట బీటీ రహదారి, రూ.5 కోట్లతో ఇల్లందు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి కామేపల్లి స్మశానవాటిక వరకు పెద్దచెరువు మీదుగా నిర్మించనున్న బీటీ రహదారి పనులను ప్రారంభించారు. ఈ పనులతో విద్యుత్, రహదారి మౌలిక సదుపాయాలు మెరుగుపడి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందనున్నాయని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, టీజీ ఎన్పిడిసిఎల్ ఎండి వరుణ్ రెడ్డి,ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య,వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీజీ ఎన్పిడిసిఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, సిఇ రాజు చౌహాన్, ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాస చారి, పీఆర్ ఎస్ఇ జి. వెంకట్ రెడ్డి, ఇఇ మహేష్ బాబు,కామేపల్లి తహసీల్దార్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టుల హక్కుల సాధనకు సభ్యత్వమే బలం

**సిరిసిల్ల నియోజక వర్గంలో టీయూడబ్ల్యూజే హెచ్-143 సభ్యత్వ నమోదు కార్యక్రమం**
**అక్రిడిటేషన్, బస్‌పాస్, ఇళ్ల స్థలాల కోసం ఉద్యమానికి ప్రణాళికలు**
**జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా**



**రాజన్న సిరిసిల్ల, జూలై 19 (తెలంగాణ వాణి)**
రాజన్న సిరిసిల్ల జిల్లాలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూ జే హెచ్-143) సభ్యత్వ నమోదు కార్యక్రమం ఊపందుకుంది. రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ నాయకత్వంలో కొనసాగుతున్న సంఘం సభ్యత్వ విస్తరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా ఆధ్వర్యంలో ఆదివారం సిరిసిల్ల నియోజక వర్గంలోని తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సభ్యత్వం పొందిన జర్నలిస్టులకు సభ్యత్వ నమోదు రసీదులు అందజేశారు. ఈ సందర్భంగా లాయక్ పాషా మాట్లాడుతు జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి భద్రత, హక్కుల పరిరక్షణ కోసం టీయూడబ్ల్యూజే హెచ్-143 నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో బలమైన సంఘటిత శక్తి అవసరమని, సభ్యత్వ నమోదు ద్వారా సంఘం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరు, ఆర్టీసీ బస్‌పాస్ సౌకర్యం, ఇళ్ల స్థలాల కేటాయింపు వంటి కీలక అంశాలపై ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసే విధంగా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కేవలం డిమాండ్లు చేయడం మాత్రమే కాకుండా, ప్రభుత్వంతో చర్చలు, అవసరమైతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సంఘం సిద్ధంగా ఉందని చెప్పారు.అక్రిడిటేషన్, బస్‌పాస్, ఇళ్ల స్థలాలు వంటి అంశాలు చాలా కాలంగా జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లుగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు ఇరుకుల్ల ప్రవీణ్ కుమార్, క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ సయ్యద్ రసూల్, జిల్లా కోశాధికారి సయ్యద్ కలీం, జిల్లా కమిటీ సభ్యుడు కమటాల విజయ్, వేములవాడ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ, తంగళ్లపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా సంయుక్త కార్యదర్శి బాబ్జి, సీనియర్ పాత్రికేయులు బుగ్గ కృష్ణమూర్తి, ఎల్లారెడ్డిపేట ప్రెస్‌క్లబ్‌బాధ్యులుబాలరాజు,ముస్తాబాద్ బాధ్యులు లక్ష్మీనారాయణతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
సోమవారం । 20 । జూలై । 2026

# కొత్తగూడెం పాల్వంచ ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి14 కోట్లతో దమ్మపేట పాల్వంచ నాలుగు లేన్ల రహదారి విస్తరణకు శంకుస్థాపన

### 50 లక్షలతో సీసీ రోడ్ పనులు , 50 లక్షలతో సెంట్రల్ లైటింగ్‌డివైడర్ అభివృద్ధి పనులకు శ్రీకారం

### పాల్వంచలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం...

### జీవో76 అంశంపై త్వరలో స్పష్టత





కొత్తగూడెం, జులై 19 (తెలంగాణ వాణి)

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దమ్మపేటపాల్వంచ ప్రధాన రహదారిలో జిల్లా ఖనిజ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధుల ద్వారా 14 కోట్ల నిర్మాణ వ్యయంతో సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర రెండు లేన్ల రహదారిని నాలుగు లేన్ల రహదారిగా విస్తరించే పనులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్ తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంచికంటి నగర్ హర్ష టౌన్‌షిప్‌లోని ఎస్‌కేటీ అపార్ట్‌మెంట్ నుంచి ప్రధాన రహదారి వరకు 50 లక్షల నిర్మాణ వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి గోదుమవాగు వరకు 50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సెంట్రల్ లైటింగ్, డివైడర్ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇవ్వడమే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదల సంక్షేమ కార్యక్రమాలను నిరంతరంగా అమలు చేస్తూనే, మౌలిక వసతుల అభివృద్ధి పనులను కూడా వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. అదే క్రమంలో కొత్తగూడెంపాల్వంచ ప్రాంతంలో రహదారులు, పట్టణ మౌలిక సదుపాయాలు, పారిశ్రామికాభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో కూడా స్థానిక శాసనసభ్యులతో కలిసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దమ్మపేటపాల్వంచ రహదారి గత అనేక సంవత్సరాలుగా దెబ్బతిని ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని, పాల్వంచతో పాటు అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల ప్రజలు కూడా ఈ రహదారిపై ఆధారపడుతున్నందున అత్యవసరంగా డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి 14 కోట్లను మంజూరు చేసి నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేస్తు న్నామని తెలిపారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాల్వంచ ప్రాంతంలో భూ సమస్యలు, రిజిస్ట్రేషన్ సమస్యలు చాలాకాలంగా పెండింగ్ లో ఉన్నాయని, ఇప్పటికే కొన్ని సర్వేలు పూర్తయ్యాయని, మిగిలిన సర్వేలను కూడా వేగవంతంగా పూర్తి చేసి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి తెలిపారు. సింగరేణి పరివాహక ప్రాంతాలకు సంబంధించిన జీవో76 అంశంపై కూడా ప్రభుత్వం సానుకూలంగా పరిశీలన జరుపుతోందని, త్వరలోనే దీనిపై స్పష్టత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పాల్వంచ పారిశ్రామిక ప్రాధాన్యతను మరింత పెంచేందుకు కాలుష్య రహిత పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కొత్తగూడెం పరిసర ప్రాంతంలో విమానాశయం ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని చెప్పారు. జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటలు, మెట్ట పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేపట్టడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని, రైతులకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పేదల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వెనుకడుగు వేయడం లేదన్నారు. ప్రతి అర్హ కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డుల జారీ వంటి హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ గృహాల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నామని, మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్‌కు అదనంగా మరో లక్ష ఇళ్లను మంజూరు చేసి మొత్తం సుమారు 8 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఇప్పటికే లక్షన్నర ఇళ్లు పూర్తయ్యాయని, మరో రెండు లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని అన్నారు .విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ గురుకుల, ఆశ్రమ విద్యాసంస్థల్లో డైట్ ఛార్జీలను పెంచడంతో పాటు రాష్ట్రంలో పారదర్శకంగా సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న అభివృద్ధి పనులు ఇప్పుడు వేగంగా అమలవుతున్నాయని అన్నారు. కొత్తగూడెంపాల్వంచ బైపాస్ రహదారి నిర్మాణం, యూనివర్సిటీ అభివృద్ధి, అంతర్జాతీయ స్థాయి స్టేడియం ఏర్పాటు, పాల్వంచలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం, మెడికల్ కాలేజీ, ఎస్పీ కార్యాలయం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పేరును కొత్తగూడెంపాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్‌గా మార్చే ప్రతిపాదనపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని పేర్కొన్నారు. జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక తదితర శాఖల సమన్వయంతో ముందస్తు కార్యాచరణ చేపట్టినట్లు మంత్రికి వివరించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, మెట్ట పంటల సాగు, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన వ్యవసాయ విధానాలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, స్థానిక సంస్థలకు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బూటకపు మెడికల్ బోర్డును రద్దు చేసి రీ-మెడికల్ బోర్డు నిర్వహించాలి

### కార్మికుల జీవితాలతో యాజమాన్యం చెలగాటం ఆడుతోంది: ఏఐటీయూసీ నాయకుడు మిరియాల రంగయ్య

కొత్తగూడెం సింగరేణి, జూలై 19 (తెలంగాణ వాణి):



ఇటీవల నిర్వహించిన మెడికల్ బోర్డు ప్రక్రియ బూటకమని ఆరోపిస్తూ, దానిని వెంటనే రద్దు చేసి గతంలో అమలు చేసిన విధానంలోనే రీ-మెడికల్ బోర్డు నిర్వహించాలని ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య డిమాండ్ చేశారు.ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, జూలై 17, 18 తేదీల్లో జరిగిన మెడికల్ బోర్డు పారదర్శకంగా నిర్వహించలేదని, దీంతో అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర అన్యాయానికి గురయ్యాయని అన్నారు.మెడికల్ బోర్డు జాబితాలో పేర్లు ఉన్న పలువురు కార్మికులకు సమాచారం కూడా అందించలేదని, మంచానికే పరిమితమైన వారు, గుండె, కిడ్నీ తదితర తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని సైతం బోర్డు పేరుతో ఇబ్బందులకు గురిచేయడం అమానవీయమని విమర్శించారు.సింగరేణి ప్రధాన ఆసుపత్రి వైద్యుల నివేదికల ఆధారంగా గతంలో అమలు చేసిన విధానంలోనే అర్హులైన కార్మికులను ఇన్వాలిడేషన్ చేసి వారి వారసులకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే మెడికల్ బోర్డుకు ఉన్న రెండేళ్ల కాలపరిమితి నిబంధనను తొలగించి, దరఖాస్తు చేసిన వెంటనే ఇన్వాలిడేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు.ప్రస్తుతం సుమారు 2,000 మంది కార్మికులు మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్నారని, నెలకు రెండుసార్లు బోర్డు నిర్వహించి పెండింగ్ కేసులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరగకపోతే సింగరేణి వ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# దేశానికి గర్వకారణం పీవీ సింధు

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హాకీ అసోసియేషన్ చైర్మన్ పల్లపోతు శ్రీనివాస్ (వాసు)

### జపాన్ ఓపెన్ టైటిల్ కైవసంపై సింధుకు అభినందనలు తెలిపిన వాసు

కొత్తగూడెం, జూలై 19 (తెలంగాణ వాణి):



జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హాకీ అసోసియేషన్ చైర్మన్ పల్లపోతు శ్రీనివాస్ (వాసు) హృదయపూర్వక అభినందనలు తెలిపారు. జపాన్‌కు చెందిన అకానే యమగూచిని వరుస సెట్లలో 21-17, 21-17 తేడాతో ఓడించి జపాన్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. భారత మహిళా షట్లర్‌గా ఈ ఘనత సాధించడం దేశ క్రీడా చరిత్రలో విశేషమని కొనియాడారు.పీవీ సింధు తన ప్రతిభ, కృషితో ప్రపంచ స్థాయిలో భారతదేశానికి గుర్తింపు తీసుకొచ్చారని, భవిష్యత్తులో కూడా మరిన్ని అంతర్జాతీయ టైటిళ్లు సాధించి దేశ కీర్తిని మరింత ఇనుమడింపజేయాలని, అలాగే యువ క్రీడాకారులు పీవీ సింధు ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పేర్కొన్నారు.

# కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగాలకు ప్రాధాన్యం ఇవ్వాలి: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి





హనుమకొండ/కాజీపేట, జులై (తెలంగాణ వాణి)

కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రైల్వే జేఏసీ, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మాడికొండ నుంచి కాజీపేట రైల్వే జంక్షన్ స్టేషన్ వరకు నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో వరంగల్ ప్రాంత యువత ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉద్యోగాల కల సాకారం కావాలని అన్నారు. ఫ్యాక్టరీలో కల్పించే ఉద్యోగాల్లో స్థానికులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో రైల్వే జేఏసీ తీసుకునే నిర్ణయాలకు అన్ని రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలని, జేఏసీ నాయకత్వంలో ఉద్యమం ఐక్యంగా కొనసాగాలని పిలుపునిచ్చారు. ఫ్యాక్టరీలో సుమారు మూడు వేల ఉద్యోగాలను స్థానిక యువతకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు లేని యువతకు శిక్షణ అందించేందుకు ప్రభుత్వం, సంబంధిత సంస్థలు ముందుకు రావాలని, అవసరమైన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించేందుకు తాము కూడా సహకరిస్తామని తెలిపారు. స్థానిక యువతకు వారి అర్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారానే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అదేవిధంగా, కోచ్ ఫ్యాక్టరీ కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, అలాగే ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు కూడా తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ప్రాంత అభివృద్ధికి, యువత భవిష్యత్తుకు మైలురాయిగా నిలవాలంటే స్థానికులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వే జేఏసీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం ఆలయ పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలి

### ప్రత్యేక అధికారిని నియమించి ప్రతి 10 రోజులకు సమీక్ష నిర్వహించాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి





భద్రాచలం, జూలై 19 (తెలంగాణ వాణి):

గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులను పూర్తిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు 15 రోజుల ముందుగానే అన్ని పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఆదివారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకున్న మంత్రి, అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీఓ రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, దేవస్థానం ఈవో దామోదర్ రావుతో కలిసి ఆలయ పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.351 కోట్లు, భూసేకరణ కోసం రూ.75 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఆలయ పునరుద్ధరణ పనులను ఆగమశాస్త్రాలకు అనుగుణంగా, ప్రాచీన వైభవానికి భంగం కలగకుండా నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఆదేశించారు.గోదావరి పుష్కరాల దృష్ట్యా కొత్త స్నాన ఘాట్లు, యాత్రికుల సౌకర్యాలు, మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనుల కారణంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత వంటి ఏర్పాట్లు కల్పించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆలయ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని వెంటనే నియమించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌కు టెలిఫోన్ ద్వారా ఆదేశించారు. ప్రతి 10 రోజులకు ఒకసారి క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించాలని, అవసరమైతే అదనంగా కార్మికులను నియమించి పనులు వేగవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో దేవాదాయ శాఖ, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, ఆర్కిటెక్టులు, ఆలయ అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జీవితానికి చెస్ ఆట దిక్సూచి శాసన సభ్యులు గంగుల కమలాకర్



కరీంనగర్, జులై 19 (తెలంగాణ వాణి)

జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ జాతీయ జూనియర్ చెస్ పోటీలు కరీంనగర్‌లో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ విజేతలకు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో విద్యార్థులు సెల్ ఫోన్లకు బానిసలు కాకుండా, మేధోశక్తిని, మానసిక దృఢత్వాన్ని పెంచే చెస్ వంటి క్రీడల వైపు వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. చెస్ ఆటకు, జీవిత గమనానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. చద రంగంలో ఒక పావును తప్పుగా కదిపితే ఎలాగైతే ఆట ఓడిపోయే ప్రమాదం ఉంటుందో, జీవితంలో కూడా ఒక్క తప్పుడు నిర్ణయం తీసుకుంటే భవిష్యత్తును కోల్పోయే అవకాశం ఉందని విద్యార్థులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకులు మైకేల్ శ్రీనివాస్, చెస్ అకాడమీ నిర్వాహకులు అనూప్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోటీల నిర్వహణకు సహకరించిన స్పాన్సర్లను నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులను అకాడమీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

# సామాజిక చలన శీలతకు ఆనవాళ్లు వేముల డైరీ రచన నేనూ... నా ప్రపంచం

### ప్రముఖ సాహిత్య పరిశోధకులు డా.మచ్చ హరిదాసు

కరీంనగర్ టౌన్, జులై 19 (తెలంగాణ వాణి)



విశ్రాంత అధ్యాపకుడు, రచయిత వేముల సత్యనారాయణ గత యాభై రెండేళ్లుగా నిష్కాపట్యంతో రాసిన డైరీ దినచర్య రచన నేనూ... నా ప్రపంచం-ఉద్యోగ ప్రస్థానంసమాజపు ఆటు పోట్లకు విద్యా సంబంధిత చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచిందని ప్రముఖ సాహిత్య పరిశోధకులు డా.మచ్చ హరిదాసు అన్నారు. కరీంనగర్ ఫిలింభవన్ లో సాహితీ సోపతి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వేముల సత్యనారాయణ స్వీయ రచన ఉద్యోగ ప్రస్థానంను ఆవిష్కరించారు. 1979 నుండి 2012 వరకు ఉపాధ్యాయుడిగా, ఉపన్యాసకుడిగా ముప్పై మూడు సంవత్సరాల పాటు కొనసాగిన సత్యనారాయణ ఉద్యోగ జీవన గమనాన్ని కళాత్మక హృదయంతో హృద్యంగా వెల్లడించడమే కాకుండా ఆనాటి సామాజిక ఆర్థిక రాజకీయ స్థితిగతులను కళ్లకు కట్టించారని కొనియాడారు. నిరంతర కృషితో అంచలంచెలుగా ఎదిగిన సత్యవంతమైన సత్యనారాయణ జీవితం ఎందరికో ఆదర్శప్రాయం అయిందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డా.నలిమెల భాస్కర్ మాట్లాడుతూ, తెలుగు సాహిత్యంలోని ఖాళీలను పూరించవలసిన అవసరం ఉందని సూచించారు. రచయితలు ఇష్టంతో చేసే పనులు తమ అంతర్గత శక్తులను ఇనుమడింప చేస్తాయనడానికి వేముల రాసిన ఉద్యోగ ప్రస్థానం పుస్తకమే నిదర్శనం అన్నారు. దినచర్య రాయడం మంచి అలవాటని, అది స్వీయ క్రమశిక్షణను అలవరుస్తుందని పేర్కొన్నారు. ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత డా.బి.వి.ఎన్.స్వామి పుస్తక సమీక్ష చేశారు. ప్రముఖ కవులు జూకంటి జగన్నాథం, బూర్ల వెంకటేశ్వర్లు, కూకట్ల తిరుపతి ఆత్మీయ ప్రసంగాలు చేశారు. రంగినేని మోహనరావు, మద్దికుంట లక్ష్మణ్, పి.ఎస్. రవీంద్ర, నగునూరి శేఖర్, దామరకుంట శంకరయ్య, నడిమెట్ల రామయ్య, కందుకూరి అంజయ్య, గుండు రమణయ్య, సిరిశినహాళ్ నీలవేణి, వేముల ప్రభావతి, నలిమెల సావిత్రి, నేదునూరి రాజేశ్వరి, అడువాల సుజాత, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు. అనంతరం వేములను కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, కవులు రచయితలు ఘనంగా సన్మానించారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
సోమవారం । 20 । జూలై । 2026

# నిరుద్యోగ యువతకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

## ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా మెగా జాబ్ మేళా

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి





**హనుమకొండ, జులై 19 (తెలంగాణ వాణి)**

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తోందని, యువతకు ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగంలోనూ మెరుగైన ఉద్యోగ అవకాశాలు అందించేందుకు పలు కార్యక్రమాలను చేపడుతోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కెడీసీ) లో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగాల కోసం వచ్చిన యువతను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ, పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తున్నామని తెలిపారు. అర్హత, ప్రతిభ కలిగిన ప్రతి యువకుడు ఇలాంటి జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ జాబ్




మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొని వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించడం అభినందనీయమన్నారు. ఉద్యోగాల కోసం వచ్చిన యువకులు, యువతులతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి వారి విద్యార్హతలు, ఆసక్తులు, ఉద్యోగ అవకాశాలపై ఆరా తీశారు. అలాగే వివిధ ప్రైవేట్ రంగ సంస్థల ప్రతినిధులతో సమావేశమై స్థానిక యువతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కెడీసీ) ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశమైన ఎమ్మెల్యే కళాశాలలోని మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన పనులపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలని అధికారులను ఆదేశించారు. వాటిని సంబంధిత శాఖ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరు చేయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యా సంస్థల బలోపేతం, యువతకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. యువత ఉద్యోగాలు పొందడమే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు విష్ణు రెడ్డి, ఆర్టీఏ మెంబర్ పల్లకొండ సతీష్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కళాశాల అధ్యాపకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.